



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న కలెక్టర్ చేతన్

# స్వచ్ఛ జిల్లాగా మారుద్దాం

## కలెక్టర్ టిఎస్.చేతన్

**ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్**

స్వర్ణాంధ్ర, స్వచ్ఛంధ్రలో భాగంగా సత్యసాయి జిల్లాను స్వచ్ఛ జిల్లాగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కలెక్టర్ టిఎస్.చేతన్ పిలుపునిచ్చారు. శనివారం నాడు స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని హనుమాన్ సర్కిల్లో చేపట్టిన ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ అక్కడి నుంచి చిత్రావతి నది వరకు కొనసాగింది. అక్కడ మనోహరంగా ఏర్పడి స్వచ్ఛ జిల్లాగా తీర్చిదిద్దుదాం అని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాపిస్తాయని ఈ పరిస్థితుల్లో ఎక్కడా కూడా నీటి విలువలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్లాస్టిక్‌ను వాడకూడదని వాటిని నిషేధించడం జరిగిందన్నారు. డ్రెయినేజీ కాలువలు శుభ్రంగా ఉంచడానికి సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతి పాఠశాల, ప్రభుత్వ కార్యాలయాలు, మార్కెట్లు పరిశుభ్రంగా ఉంచాలని తద్వారా స్వచ్ఛ జిల్లాగా తీర్చిదిద్దాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సువర్ణ, మున్సిపల్ కమిషనర్ క్రాంతికుమార్, పసుసంవర్ధక శాఖ జెడి శుభదాస్, సాంఘిక సంక్షేమ శాఖ డిడి రెడ్డి బాలాజీ, గిరిజన సంక్షేమ శాఖ అధికారి మోహన్ రావు, తహశీల్దార్ కళ్యాణ్ చక్రవర్తి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఇప్పటికీ 60 శాతం బీడే



◆ ఉమ్మడి జిల్లాలో ముందుకుసాగని ఖరీఫ్
◆ ఆగస్టులో వర్షాలొచ్చినా ప్రత్యామ్నాయం లేక ఖాళీ

**ప్రజాశక్తి -అనంతపురం ప్రతినిధి**

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఖరీఫ్ సీజన్ ముగియడానికి వస్తున్నా ఇప్పటికీ 60 శాతం భూమిలో విత్తనం పడలేదు. 10.4 లక్షల ఎకరాలు బీడుగా ఉంది. 17.33 లక్షల ఎకరాల్లో ఈ ఏడాది పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ మొదట అంచనా వేసింది. ఈ మేరకు అనంతపురం జిల్లాలో 9.78 లక్షల ఎకరాలయితే విత్తనం పడింది 5.07 లక్షల ఎకరాల్లో. 60 శాతం సాగైంది. ఇక సత్యసాయి జిల్లాలో 7.55 లక్షల ఎకరాలకుగానూ విత్తనం పడింది కేవలం 1.86 లక్షల ఎకరాల్లోనే అంటే సాధారణ సాగులో 34 శాతమే పంటలు సాగయ్యాయి. కీలకమైన జూన్, జులై నెలల్లో వర్షాలు లేకపోవడంతో రైతులు విత్తనం వేసుకోలేకపోయారు. ఆగస్టు మాసంలో మంచి వర్షాలొచ్చినప్పటికీ ప్రధాన పంట అయిన వేరుశనగ సాగుకు అదును దాటిపోయింది. దీంతో ఖరీఫ్ సాగు ఆశాజనకంగా సాగలేదు. అయితే ప్రభుత్వం సమయముందున్న ఉద్దేశంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయలేదు. ప్రత్యామ్నాయ విత్తనాల్లేకపోవడంతో ఇతర పంటల సాగు కూడా అంతంత మాత్రంగానే సాగింది.

**గణనీయంగా తగ్గిన వేరుశనగ సాగు**

ఉమ్మడి జిల్లాలో ప్రధాన పంట వేరుశనగ సాగు గణనీయంగా తగ్గింది. అనంతపురం జిల్లాలో 4.49 లక్షల ఎకరాలయితే సాగైంది కేవలం 1.71 లక్షల ఎకరాల్లోనే సాగైంది. సాధారణంలో 38 శాతమే సాగైంది. ఇక సత్యసాయి జిల్లాలో 3.75 లక్షల ఎకరాలు సాధారణ సాగయితే లక్ష ఎకరాల్లోనే విత్తనం వేశారు. 27 శాతమే అయింది. ఇక కంది పంట అయితే సాధారణం కంటే గణనీయంగా పెరిగింది. కంది అనంతపురం జిల్లాలో 1.36 లక్షల ఎకరాలయితే 1.93 లక్షల ఎకరాలయింది. సాధారణం కంటే 142 శాతం అధికమైంది. సత్యసాయి జిల్లాలో 71 వేల ఎకరాలయితే 52 వేల ఎకరాల్లో సాగైంది. సజ్జ పంట అనంతపురం జిల్లాలో సాధారణ సాగు 5075కు గానూ 7583 ఎకరాల్లో 149 శాతం సాగైంది. సత్యసాయి జిల్లాలో రెండు ఎకరాలకుగానూ 1341 ఎకరాల్లో అయింది. పత్తి, వరి ఇతర పంటలు కూడా సాధారణం కంటే తక్కువగానే సాగయ్యాయి.

**అదునులో ప్రత్యామ్నాయం కరువు**

ఖరీఫ్ సీజన్‌లో కీలకమైన జూన్, జులై నెలల్లో తీవ్ర వర్షాభావం నెలకొంది. ఆగస్టులో అధిక వర్షాలు నమోదయ్యాయి. కరువు మండలాల ప్రకటన జరగాలంటే ఆగస్టు ఆఖరు వరకు సీజన్‌ను చూసి ఇవ్వడం జరుగుతుంది. ఆ తరువాత కూడా వర్షాభావం ఉంటేనే కరువు పరిస్థితులు వచ్చినట్టు భావిస్తారు. ఆగస్టులో పెద్దఎత్తున ఉమ్మడి జిల్లాలో వర్షపాతం నమోదయింది. మొదటి రెండు నెలలు పడలేదు. రెండు నెలలు పడకపోవడంతో అదునులో పదునులేక రైతులు విత్తనం విత్తుకోలేకపోయారు. ఆగస్టులో వేసినా పెద్దగా పంటరాదన్న ఉద్దేశ్యంతో రైతులు ప్రధాన పంట వేరుశనగను సాగు చేయలేకపోయారు. దీంతో ఎప్పుడూలేనంత తక్కువగా వేరుశనగ ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలో పడిపోయింది. ఇక ప్రత్యామ్నాయ విత్తనాలను ప్రభుత్వం అందుబాటులో ఉంచిఉంటే ఆగస్టులో పడుతున్న వర్షాలతోనైనా పంటలు సాగుచేసుకునేందుకు వీలుండేదని రైతులు వాపోతున్నారు.

# ఆదర్శ పాఠశాల పరిశీలన

**ప్రజాశక్తి-హిందూపురం**

లేపాక్షి మండల పరిధిలోని చోళసముద్రం ఆదర్శ ప్రాథమిక పాఠశాలను జిల్లా విద్యా శిక్షణ సంస్థ నిపుణులు ఆదర్శ్ శనివారం పరిశీలించారు. పాఠశాలలో అన్ని విభాగాలను పరిశీలించి సంతప్తి వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా మధ్యాహ్న భోజన పథకం, పాఠశాల ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు పట్టికలు, పిల్లల విద్యా స్థాయి ఎఫ్ఏ1 పరీక్షల నిర్వహణ, మార్కుల జాబితా, ఆన్ లైన్ ప్రవేశం, పిల్లల విద్య గుణాత్మక విద్య, ఆదర్శ పాఠశాల అవసరాలు, ఉపాధ్యాయ శిక్షణలు, పాఠశాల సముదాయం నిర్వహణ వల్ల లాభాలు, విద్యా పథకాలు, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలు, పాఠశాల రిజిస్టర్ల తనిఖీలు తదితర అంశాలను పిల్లలను వ్యక్తిగతంగా పరిశీలించి పరీక్షించి సంతప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.హరిప్రసాద్, ఉపాధ్యాయులు అనిత, సునీత, లక్ష్మీదేవి, నాగ కల్పన తదితరులు పాల్గొన్నారు.


టంగుటూరికు నివాళులు అర్పిస్తున్న కలెక్టర్

# ఆంధ్రకేసరి జీవితం స్ఫూర్తినీయం : కలెక్టర్

**ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్**

ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జీవితం ఆదర్శప్రాయమని కలెక్టర్ టిఎస్.చేతన్ కొనియాడారు. శనివారం కలెక్టరేట్లో ప్రకాశం పంతులు 154వ జయంతి సందర్భంగా కలెక్టర్ ఇతర అధికారులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివారణ అర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఆయన పేదరికం అనుభవించి ఒక గొప్ప న్యాయవాదిగా వలసవాద వ్యతిరేక జాతీయ వాదిగా, రాజకీయ నాయకుడిగా, సంఘసంస్కర్తగా సమాజానికి ఎనలేని సేవలు అందించారన్నారు. ఆంధ్ర రాష్ట్రం మద్రాసు నుంచి విడిపోయాక ఆంధ్ర రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రిగా పని చేశారన్నారు. స్వాతంత్ర సమరంలో భాగంగా సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొన్నారన్నారు. సైమన్ కమిషన్ ఇండియాలో పర్యటించిన సమయంలో సైమన్ కమిషన్ గో బ్యాక్ అంటూ గుంటూరులో 30 వేల మందితో బహిష్కరణ ఉద్యమం చేపట్టారన్నారు. ఆ సమయంలో తన రొమ్ము చూపి కాల్చండి రా అంటూ సవాలు విసిరిన ధైర్యశాలి ప్రకాశం పంతులు అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ స్పెషల్ కలెక్టర్ రామసుబ్బయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

# అసంబద్ధాలను సరి చేయండి : యుటిఎఫ్

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

ఉమ్మడి అనంతపురం జిల్లా జడ్పీ భవిష్యనిధి ఖాతా ఆప్డేషన్‌లో తలెత్తిన అసంబద్ధాలను సరిచేయాలని యుటిఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.జయ చంద్రారెడ్డి, శ్రీసత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ మాట్లాడుతూ శుక్రవారం నాడు ఆన్‌లైన్‌లో ఉంచిన జెడ్పీ భవిష్యనిధి ఖాతాల అప్డేషన్‌లో అనేక అసంబద్ధాలు నెలకొన్నాయన్నారు. 2023 -24 సంవత్సరానికి సంబంధించి కొంతమంది ఉపాధ్యాయులకు అప్డేషన్ కాలేదన్నారు. మరికొంతమంది ఉపాధ్యాయుల భవిష్యనిధి ఖాతా నుంచి ఎటువంటి రుణం తీసుకోకున్నా తీసుకున్నట్లు ఆన్లైన్‌లో చూపిస్తోందన్నారు. 2024-25 సంవత్సరాలనికి సంబంధించిన పిఎఫ్ షెడ్యూల్స్‌ను డిడిఒల నుంచి వెంటనే తెప్పించుకుని వాటిని కూడా త్వరగా అప్డేట్ చేయాలని డిమాండ్ చేశారు.

# అర్హులందరికీ డ్రిప్ అందిస్తాం

## ఏపీఎంఐపి పీడీ సుదర్శన్

**ప్రజాశక్తి-హిందూపురం**


పీడీ సుదర్శన్

అర్హత కలిగిన రైతులందరికీ ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ద్వారా డ్రిప్, స్ప్రింక్లర్లను అందిస్తామని మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సుదర్శన్ పేర్కొన్నారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన వివరించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఏపీఎంఐపి ప్రాజెక్ట్ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు ద్వారా డ్రిప్, స్ప్రింక్లర్లు అవసరమైన రైతులకు అందిస్తామన్నారు. శ్రీ సత్యసాయి జిల్లాలో 1400 హెక్టార్లను గుర్తించి 559 హెక్టార్ల మంజూరుకు కలెక్టర్ నుంచి అనుమతుల తీసుకున్నామన్నారు. డ్రిప్, స్ప్రింక్లర్స్ అవసరమైన రైతులు రైతు సేవా కేంద్రాల ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. రైతులు 1-బి, ఎఫ్ఎంబి స్కెచ్, పొలం చెక్కుబంది సర్టిఫికెట్, ఆధార్ కార్డు జిరాక్స్, బ్యాంకు పాస్ పుస్తకం జిరాక్స్, కరెంట్ బిల్లు, ఎస్సీ, ఎస్టీ రైతులు కుల ధ్రువీకరణ పత్రం జత చేసి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ సంవత్సరం ఎస్సీ, ఎస్టీ రైతులకు పట్టాదారు పాసు పుస్తకంలో 5 ఎకరాలు వరకు 100 శాతం సబ్సిడీ, పట్టాదారు పాస్ పుస్తకంలో 10 ఎకరాల వరకు ఉన్న ఇతర రైతులకు 90శాతం సబ్సిడీ, 10 ఎకరాలు పైన ఉన్న రైతులకు 50శాతం సబ్సిడీ సబ్సిడీ ప్రకారం డ్రిప్, స్ప్రింక్లర్లు అందిస్తామన్నారు. మరింత సమాచారానికి ఆయా డివిజినల్ ఎంఐఎలను సంప్రదించాలని సూచించారు.

# మంచి నడవడిక అలవర్చుకోండి

## సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు నాయక్

**ప్రజాశక్తి-హిందూపురం**


ఖైదీలతో వివరాలు తెలుసుకుంటున్న న్యాయమూర్తి వెంకటేశ్వర్లు నాయక్

ఉపకారాగారాల్లో ఉన్న నిందితులు మంచి ప్రవర్తనతో ఉండి బయటికి వెళ్లిన తర్వాత ఘర్షణలు, కక్షల జోలికి వెళ్లకుండా ప్రశాంత జీవనం ప్రారంభించాలని సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు నాయక్ సూచించారు. శనివారం స్థానిక ఉపకారగారాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపకారగారంలో ఉన్న నిందితులో అక్కడి సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. న్యాయం సహాయం అవసరమైన దరఖాస్తు చేసుకుంటే ఉచిత న్యాయ సహాయం అందించే ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం ఖైదీల కోసం తయారుచేసిన భోజనంను పరిశీలించి సంతప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపకారాగార అధికారి హనుమన్న, న్యాయవాది నవేరా, లోక్ అదాలత్ సిబ్బంది హేమావతి, పారా లీగల్ వాలంటీర్ మాళప్ప తదితరులు పాల్గొన్నారు.


గదులను శుభ్రం చేస్తున్న అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ

**న్యాయస్థానాల్లో స్వచ్ఛభారత్**

ఉన్నత న్యాయస్థానాల ఆదేశాల మేరకు శనివారం స్థానిక న్యాయస్థానాల్లో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని చేపట్టారు. స్థానిక అదనపు జిల్లా న్యాయస్థానంతో పాటు సీనియర్ సివిల్ జడ్జి, జూనియర్ సివిల్ న్యాయస్థానం, అదనపు జూనియర్ సివిల్ న్యాయస్థానం, ప్రత్యేక న్యాయస్థానం, రెండవ తరగతి న్యాయస్థానాల్లో సిబ్బంది చీపుర్లు చేతబట్టి తమతమ న్యాయస్థానాలను శుభ్రం చేసుకున్నారు. అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ, సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు నాయక్ లు సైతం చీపురులను చేతబట్టి న్యాయస్థానాలను శుభ్రం చేశారు.

# స్వయం ఉపాధిని పెంపొందించుకోండి

## మున్సిపల్ ఛైర్మన్ డిఈ రమేష్ కుమార్

**ప్రజాశక్తి-హిందూపురం**


సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్మన్ రమేష్ కుమార్

ప్రస్తుత పరిస్థితుల్లో మహిళలు స్వయం ఉపాధిపై దష్టి సారించి ఆర్థిక అభివద్ధి సాధించాలని మున్సిపల్ ఛైర్మన్ డిఈ రమేష్ కుమార్ సూచించారు. శనివారం మున్సిపల్ పరిధిలోని 11వ వార్డు మోడల్ కాలనీ వార్డులో కౌన్సిలర్ అంజలి రమేష్ రెడ్డి అధ్యక్షతన ఎన్డీఏ ప్రభుత్వ ఆధ్వర్యంలో మే నెలలో ప్రారంభించిన ఉచిత కుట్టు మిషన్ ట్రైనింగ్ సెంటర్‌లో మూడు నెలల శిక్షణ పూర్తి చేసుకున్న సందర్భంగా ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి మున్సిపల్ ఛైర్మన్‌తో పాటు సెంట్రల్ సీడ్స్ డైరెక్టర్ రమేష్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకష్ణ చొరవతో ఉచిత కుట్టుమిషన్ శిక్షణ కేంద్రం ప్రారంభించామన్నారు. ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకుని 120 మంది మహిళలు స్వశక్తి ఆధారాన్ని పొందారన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు తల్లి పట్టణ సమైక్య అధ్యక్షురాలు విజయలక్ష్మి, టిడిపి అరుణమ్మ, ట్రైనింగ్ సెంటర్ కోఆర్డినేటర్ జబీనా, ఆర్‌పి నాగలక్ష్మి, స్వప్న, అలివేలు, ట్రైనీ టీచర్ పుష్ప, మహిళలు పాల్గొన్నారు.

**పరిశుభ్రత ప్రజల సామాజిక బాధ్యత**

పరిశుభ్రత ప్రజల సామాజిక బాధ్యతగా గుర్తించాలని మున్సిపల్ ఛైర్మన్ డిఈ.రమేష్ కుమార్ పేర్కొన్నారు. శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంపై ర్యాలీ నిర్వహించారు. స్థానిక చిన్న మార్కెట్ సర్కిల్ వద్ద చైర్మన్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అక్కడి నుండి మెయిన్ బజార్ మీదుగా గాంధీ సర్కిల్ వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్మన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిశుభ్రతకు ప్రాధాన్యతను ఇచ్చి, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షులు ప్రెస్ వెంకటేష్, కౌన్సిలర్లు రాఘవేంద్ర, అయూబ్, టీడీపీ నాయకులు దుర్గా నవీన్, నాగేంద్ర, అన్వర్, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు శంకర్, నిజాముద్దీన్, హెల్త్ అసిస్టెంట్ కేశవ, మెప్మా జీవోలు, ఆర్పీలు పాల్గొన్నారు.

# మత్తు పదార్థాలతో జీవితాలు నాశనం



మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలను వివరిస్తున్న డా॥జీవన

**ప్రజాశక్తి-హిందూపురం**

డ్రగ్స్, గంజాయి, మద్యం వంటి మత్తు పదార్థాలు జీవతాలను నాశనం చేస్తాయని ప్రభుత్వ ఆస్పత్రి సైకియాట్రిక్ డాక్టర్ జీవన తెలిపారు. శనివారం విప్రో కేర్స్ సహకారంతో వాసవ్య మహిళా మండలి, కుశల్ ఆరోగ్య కేంద్రం తూమకుంట వారి ఆధ్వర్యంలో ఎల్ఆర్‌జి కళాశాలలో విద్యార్థులకు మత్తు పదార్థాల వల్లే కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జీవన మాట్లాడుతూ మత్తు పదార్థాలతో జీర్ణక్రియ సమస్యలు, రక్తపోటు, గుండె జబ్బులు, మెదడు పనితీరు తగ్గడం వంటి సమస్యలకు దారితీస్తాయన్నారు. అంతేకాకుండా ఆత్మవిశ్వాసం కోల్పోవడం, ఆత్మహత్యా ప్రవత్తి, కుటుంబ విభేదాలు వంటి సామాజిక సమస్యలు కూడా పెరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బ్రహ్మానందచారి, విద్యాసంస్థల అకాడమిక్ డైరెక్టర్ ప్రసాద్, కుశల్ క్లినిక్ డాక్టర్ సల్మా, మరియమ్, కోఆర్డినేటర్ శిరీష్, లలిత తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ కొలువు.. యువతకు వెలుగు.!

**ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ ఫలితాల్లో జిల్లా నుంచి పలువురు ఉత్తీర్ణత సాధించి ఉపాధ్యాయ కొలువును చేపట్టారు. చాలాకాలంగా డీఎస్సీ కోసం ఎదురు చూసిన నిరుద్యోగులకు ఇటీవల ప్రభుత్వం విడదల చేసిన నోటిఫికేషన్‌తో ఉద్యోగాలు పొందేందుకు అర్హత సాధించారు. ఉపాధ్యాయ ఉద్యోగానికి ఎంపికైన యువత హర్షం వ్యక్తం చేశారు.**

**జిల్లా స్థాయిలో ప్రథమం**


మాధవి

**కొత్తచెరువు :** కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇటీవల డిఎస్‌సి-2025(డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీ) పరీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. రాష్ట్ర విద్యాశాఖ శనివారం మెరిట్ జాబితా విడుదల చేసింది. ఫలితాల్లో కొత్త చెరువుకు చెందిన మాధవి (స్కూల్ అసిస్టెంట్-ఇంగ్లీషు) జిల్లా స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించింది. అలాగే విఆర్ఎగా పని చేస్తున్న కిరణ్ (స్కూల్ అసిస్టెంట్-మ్యాథమేటిక్స్) జిల్లాలో 13వ ర్యాంకు సాధించారు. వీరిని పలువురు అభినందించారు.

**కేశాపురం యువకుడికి థర్డ్ ర్యాంకు**


నరేష్

**కొత్తచెరువు రూరల్ :** డీఎస్సీ పరీక్షలో మండలం లోని కేశాపురం గ్రామానికి చెందిన ఉడుమల నరేష్ (స్కూల్ అసిస్టెంట్-ఫిజికల్ ఎడ్యుకేషన్) ఉద్యోగం సాధించారు. నరేష్ 88.5 మార్కులు సాధించి జిల్లా స్థాయిలో థర్డ్ ర్యాంకు సాధించారు. దీంతో ఆయన కుటుంబ సభ్యులు, శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. కృషి, పట్టుదల, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వానికి నరేష్ నిదర్శనంగా నిలిచాడు. జిల్లా స్థాయిలో తృతీయ ర్యాంకు సాధించడం గర్వకారణం. నరేష్ విజయాన్ని చూసి గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించి, కుటుంబం, గ్రామం, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

**రైతు బిడ్డ రేవతికి మూడు ఉద్యోగాలు**


రేవతి

**ముదిగుబ్బ :** డీఎస్సీ పరీక్షలో మండలంలోని ఎనుములవారిపల్లె గ్రామానికి చెందిన రేవతి మూడు ఉద్యోగాలకు ఎంపికైంది. గంజపురి వీరప్ప, లింగమ్మ దంపతుల కుమార్తె గంజపురి రేవతి జిల్లా స్థాయిలో 9వ ర్యాంక్ సాధించి స్కూల్ అసిస్టెంట్, మోడల్ స్కూల్‌కు సంబంధించి 6వ ర్యాంక్‌తో పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్(పిజిటి), ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్(టిజిటి) పోస్టులకు అర్హత సాధించింది. ఓ సాధారణ రైతు కుటుంబంలో పుట్టి ఒకేసారి మూడు ఉద్యోగాలకు అర్హత సాధించినందుకు కుటుంబ సభ్యులు, అక్క రమణమ్మ, బంధువులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

**మొన్న కానిస్టేబుల్ ప్రతిభాభారతి.. నేడు టీచర్‌గా..**


ప్రతిభా భారతి

**రొద్దం :** రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఉపాధ్యాయ పోస్టుల ఫలితాల్లో ఎస్‌జిటిలో మండల వాసికి 13వ ర్యాంక్ వచ్చింది. మండలం లోని కె.మరవ పల్లి గ్రామానికి చెందిన కురుబ విష్ణు చోలెమర్రి ఎంపిపి పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. ఆయన భార్య కురుబ ప్రతిభా భారతి జిల్లా స్థాయిలో 13వ ర్యాంకు సాధించింది. ఆమె ఇటీవల వెలుబడిన పోలీస్ కానిస్టేబుల్ ఫలితాల్లో కూడా ఉద్యోగం సాధించడం గమనార్హం. దీంతో వారి కుటుంబ సభ్యుల్లో ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.

**కానిస్టేబుల్ నుంచి పాఠశాల సహాయకునిగా..**

**సోమందేపల్లి :** స్థానిక పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న నరేష్ ఫిజికల్ సైన్స్ స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగం సాధించారు. నరేష్ సొంత ఊరు ధర్మవరం. తండ్రి డ్రైవర్. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో నరేష్ ఇంటర్మీడియట్ తర్వాత ఓ వైపు ప్రయివేట్ పాఠశాలలో

**డీఎస్సీలో పలువురి ప్రతిభ**


నరేష్

ఉపాధ్యాయునిగా పని చేస్తూ మరోవైపు డిస్టెన్స్‌లో డిగ్రీ పూర్తి చేశాడు. అనంతరం బి.ఎడ్ కూడా పూర్తి చేశాడు. 2012లో కానిస్టేబుల్ ఉద్యోగం సాధించి తొలుత పెనుకొండ స్టేషన్‌లో ఆరేళ్లు, ఆ తర్వాత ముదిగుబ్బ స్టేషన్లో ఐదేళ్లు, 7 నెలలుగా సోమందేపల్లిలో పని చేశారు. నరేష్‌ను తోటి ఉద్యోగులు, కుటుంబ సభ్యులు, మిత్రులు అభినందిచారు.

**పాత్రికేయుడి నుంచి ఫిజికల్ డైరెక్టర్‌గా బాలునాయక్**

**చిలమత్తూరు :** స్థానిక బిసి కాలనీలోని నిరుపేద కుటుంబానికి చెందిన సూర్యనారాయణ, శాంతిబాయ్ దంపతుల కుమారుడు బాలు నాయక్ ఫిజికల్ డైరెక్టర్ ఉద్యోగం సాధించారు. తండ్రి రిక్షా తొక్కుతూ, తల్లి చిల్లర అంగడి నిర్వహిస్తూ బాలునాయక్‌ను చదివించారు. బాలునాయక్ డీఎస్సీ ఫలితాల్లో ఆయన క్యాటగిరిలో 4వ స్థానం, మెరిట్ లిస్టులో 129వ ర్యాంక్ సాధించారు. ఈయన కొంతకాలం కాంట్రాక్ట్ పిఇటిగా చిలమత్తూరు, కొడికొండ హైస్కూళ్లలో, జిరాక్స్ షాపు, ఆన్‌లైన్ సర్వీసులు, కంప్యూటర్ ఇనిస్టిట్యూట్ నిర్వహించడంతో పాటు పాత్రికేయుడిగా కూడా పనిచేశారు. బాలునాయక్‌ను మిత్రులు, స్థానికులు అభినందించారు.

అలాగే కొడికొండ గ్రామంలోని నిరుపేద రైతు దంపతులు వెంకటేశప్ప, రామలక్ష్మమ్మల కుమార్తె ఎం.నాగమణి (ఎస్‌జిటి, 134వ ర్యాంకు) ఉపాధ్యాయ ఉద్యోగం సాధించింది. ఇటీవల వెలువడిన పోలీస్ కానిస్టేబుల్ ఫలితాల్లో కూడా కానిస్టేబుల్ పోస్టుకు ఎంపికైంది. ఆమెను గ్రామస్తులు, మిత్రులు అభినందించారు.


బాలు నాయక్


నాగమణి

# మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలి



విలేకరులతో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

**ప్రజాశక్తి-కదిరి టౌన్**

మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్. లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో శనివారం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పట్టణ కమిటీ సమావేశం నిర్వహించారు. యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.వెంకటేష్, ఎన్.లక్ష్మీనారాయణ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని, ఆప్కాస్‌ని రద్దుచేసి ప్రయివేట్ ఏజెన్సీలకు ఇచ్చే ప్రతిపాదనలను విరమించుకోవాలని, సంక్షేమ పథకాలు వర్తింపచేయాలి, పిఎఫ్, ఈఎస్ఐ, తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 28వ తేదీ పుట్టపర్తిలో నిర్వహించే మున్సిపల్ యూనియన్ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు అనంతరం పట్టణ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా జె.జనార్ధన, కార్యదర్శిగా ఎస్.తిరుపాలు, కోశాధికారిగా బాలకృష్ణ, 18 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జిఎల్.నరసింహులు, రామ్మోహన్, బాబ్‌జాన్, ఉదయ్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రం మార్పు వదంతులతో

# భూముల ధరలకు రెక్కలు..!

**చెరువు, పోరంబోకు భూములను విక్రయించే పనిలో కేటుగాళ్లు.. వెలుగుచూస్తున్న నకిలీ పాసు పుస్తకాలు**

**ప్రజాశక్తి-పరిగి**

గత కొన్ని రోజులుగా హిందూపురం జిల్లా కేంద్రంగా మారబోతుందన్న వార్తలు చక్కర్లు కొడుతుండటంతో కొందరు కేటుగాళ్లు రంగంలోకి దిగి నకిలీ పట్టాదారు పాసు పుస్తకాలను బట్ట బయలు చేస్తున్నారు. మండలంలో ఉన్న చెరువులు, పోరంబోకు స్థలాలకు గతంలో నకిలీ పాసు పుస్తకాలు సృష్టించుకున్న వారు తమ భూమిని ఎలాగైనా అమ్ముకొని సొమ్ము చేసుకునేందుకు ముందుకు వస్తున్నారు. అయితే విషయం ఎవరికీ అనుమానం రాకుండా కొన్ని రికార్డుల్లో నకిలీ పాసు పుస్తకాలు తయారు చేసుకుని ప్రభుత్వ భూములు, చెరువు, పోరం బోకు స్థలాలను గుర్తించి వాటి సర్వే నెంబర్, ఖాతా నెంబర్ ఆధారంగా పాస్ పుస్తకాలు సృష్టించుకుంటున్నారు. హిందూపురం ప్రధాన రహదారి వెంబడి ఉన్న చెరువు, పోరంబోకు స్థలం సర్వే నెంబర్-242 పరిధిలో ఉన్న 4.76 ఎకరాల భూమికి పి.శ్రీదేవి భర్త శివకుమార్ పేరుతో 2010లో సంబంధిత రెవెన్యూ అధికారుల నుంచి నకిలీ పాసు పుస్తకాలు సృష్టించారు. ఈ పాసు పుస్తకాల పేరుతో భూముల అమ్మకానికి కొందరు వ్యక్తులు కొన్ని రోజులుగా ప్రయత్నం చేస్తున్నారు.

**ఆ భూమి వెబ్‌ల్యాండ్‌లో చెరువుగా ఉంది**

**తహశీల్దార్ హసీనాసుల్తానా**

పి.శ్రీదేవి పేరుతో ఉన్న నకిలీ పాసు పుస్తకం రెవెన్యూ శాఖ ద్వారా ఇచ్చినది కాదు. ఆ భూమి ప్రస్తుతం వెబ్ ల్యాండ్‌లో చెరువుగా ఉంది. ఆ ప్రాంతంలో కంపచెట్ల తొలగింపు విషయం తన దృష్టికి వచ్చింది. పోలీసులకు సమాచారం ఇచ్చి నకిలీ పాసు పుస్తకాలు సృష్టించిన వారిపై చర్యలు తీసుకుంటాం. ఆ ప్రాంతంలో ప్రభుత్వం పేరుతో బోర్డులు ఏర్పాటు చేస్తాం. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూస్తాం. మండల వ్యాప్తంగా చెరువులు, పోరంబోకు, ప్రభుత్వ భూముల అక్రమణ లపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉన్నాం. ఎవరైనా ఆక్రమించుకొని అమ్మకాలకు దిగుతుంటే తమ దృష్టికి తీసుకురావచ్చు. ఇలాంటి భూముల కొనుగోళ్ల విషయంలో ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలి.



తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాగరాజు

## ప్రభుత్వ భూములను కాపాడాలి

ఈ విషయాన్ని గమనించిన జై భీమ్ పార్టీ నాయకుడు నాగరాజు శనివారం తహశీల్దార్ హసీనా సుల్తానాను కలిశారు. ఊటకూరులో చెరువు పోరంబోకు స్థలానికి నకిలీ పాసు పుస్తకాల భాగోతంపై వినతి పత్రం ఇచ్చారు. ఊటుకూరు చెరువు ప్రాంతంలో చెరువు ప్రాంతాన్ని ఆక్రమించు కొని పలువురు ఆక్రమాలకు పాల్పడుతున్న విషయాన్ని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే ఈ పాసు పుస్తకంపై విచారణ చేపట్టి నకిలీ పాసు పుస్తకం సష్టించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

**- నాగరాజు, జై భీమ్ పార్టీ నాయకుడు**

# ఆదర్శనీయం 'టంగుటూరి' జీవితం

## జయంతి సభలో ప్రముఖులు

**ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్**

ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జీవితం అందరికీ ఆదర్శనీయమని ఎస్పీ వి.రత్న కొనియాడారు. టంగుటూరి జయంతి సందర్భంగా శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, పుష్పాలు సమర్పించి నివాళులర్పించారు. ఎస్పీ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధునిగా, న్యాయవాదిగా, రాజకీయవేత్తగా, రచయితగా, సంపాదకీయునిగా, రాజనీతిజ్ఞునిగా రాణించిన విశేష ప్రతిబాశాలి టంగుటూరి అన్నారు. స్వాతంత్ర్యోద్యమంలో సైమన్ కమిషన్ భారతీయులపై కాల్పులు జరపగా, వారికి ఎదురు నిలిచి గుండెలు చూపిన ధీరుడు, ధైర్యశాలి అన్నారు. పేద కుటుంబంలో పుట్టిన ప్రకాశం పంతులు ఎంతో కష్టపడి ఉన్నత చదువులు చదివి, స్వశక్తితో ఆంధ్ర రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రిగా పని చేశారన్నారు. కార్యక్రమంలో ఏవో సుజాత, డీఎస్పీ విజయ్‌కుమార్, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఆర్‌ఐలు వలి, మహేష్, రవికుమార్, సూపరింటెండెంట్ సరస్వతి, సిసి చిరంజీవి, ఆర్ఎస్ఐలు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**బత్తలపల్లి :** స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ స్వర్ణలత, ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ నరసింహనాయుడు, సిబ్బంది టంగుటూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆయా కార్యాలయాల అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.

**ముదిగుబ్బ :** స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి తహశీల్దార్ నారాయణస్వామి, ఉద్యోగులు, సిబ్బంది పూలమాల వేసి నివాళులర్పించారు. తహశీల్దార్ టంగుటూరి సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో సిఎస్‌డిటి మునిస్వామి, కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



టంగుటూరి చిత్రపటం వద్ద సెల్యూట్‌చేస్తున్న ఎస్పీ వి.రత్న

**పెండింగ్ కేసులపై దృష్టి సారించండి : ఎస్పీ**

జిల్లా వ్యాప్తంగా పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ వి.రత్న పోలీసు అధికారులను ఆదేశించారు. పట్టణంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఉన్న కాన్ఫరెన్స్ హాలులో శనివారం ఎస్పీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. సబ్ డివిజన్ల వారీగా పోక్సో, మిస్సింగ్, గ్రేవ్, నాన్ గ్రేవ్ పెండింగ్ కేసులపైన డీఎస్పీలు, సిఐలు, ఎస్ఐలతో సమీక్షించారు. కేసుల నమోదు, దర్యాప్తులో తప్పనిసరిగా సాక్షాధారాలను అప్‌లోడ్ చేయాలన్నారు. కేసుల దర్యాప్తులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సలహాలు, సూచనలు చేశారు. పోలీస్ శాఖ ప్రవేశపెట్టిన ఐటి అప్లికేషన్స్‌ల గురించి ట్రైనింగ్ ఇచ్చి ఇప్పటినుంచి ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలన్నారు. గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం వివిధ కేసుల ఛేదింపులో ప్రతిభ చూపిన పోలీస్ సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. సమావేశంలో డీఎస్పీలు విజయకుమార్, శివనారాయణ స్వామి, నరసింగప్ప, మహేష్, హేమంత్‌కుమార్, డిసిఆర్‌బి సిఐ శ్రీనివాసులు, ఐటి కోర్ ఇన్‌ఛార్జి సుదర్శన్‌రెడ్డి, జిల్లాలోని సిఐలు ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

# అవాంఛనీయ సంఘటనలకు తావివ్వొద్దు

**పీస్ కమిటీ సమావేశంలో ఆర్డీఓ, డీఎస్పీ**

**ప్రజాశక్తి-పెనుకొండ**

అవాంఛనీయ సంఘటనలు జరగకుం డా వినాయక చవితి, మిలాద్ ఉన్ నబి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఆర్‌డిఒ ఆనంద్‌కుమార్, డీఎస్పీ నర్సింగప్ప సూచించారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలోని భువన విజయం సమావేశం మందిరంలో శనివారం పీస్(శాంతి) కమిటీ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ వినాయక విగ్రహాల నిమజ్జన సమయంలో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా ఊరేగింపు చేపట్టాలన్నారు. భారీ లౌడ్ స్పీకర్లు ఉపయోగించకూడదని, మందుగుండు సామగ్రిని పేల్చరాదన్నారు. రాజకీయ పార్టీలకు సంబంధించిన పాటలు, మతపరమైన పాటలు పెట్టరాదన్నారు. మండపాల వద్ద, ఊరేగింపులో అసభ్యకర నృత్యాలు, ఇతర ప్రదర్శనలు నిర్వహించరాదన్నారు. అతిక్రమిస్తే ఉత్సవ నిర్వాహకులపై చర్యలు తప్పవన్నారు. అనంతరం ముస్లిం, హిందూ మత పెద్దలు సూచనలు, సలహాలు ఇచ్చారు. సమావేశం లో సిఐ రాఘవన్, ఎక్సైజ్ సిఐ సృజన బాబు, కమిషనర్ సతీష్‌కుమార్, తహశీల్దార్ స్వాతి, ఎస్ఐ వెంకటేశ్వర్లు, అగ్నిమాపక శాఖ అధికారి వెంకటేశులు, వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



పీస్ కమిటీ సమావేశంలో పాల్గొన్న ఆర్డీఓ ఆనంద్‌కుమార్, డీఎస్పీ నరసింగప్ప

**చిలమత్తూరు :** మండలంలో వినాయక చవితి ఉత్సవాలను శాంతియుతంగా, క్రమశిక్షణతో నిర్వహించాలని అధికారులు నిర్వాహకులకు సూచించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహిం చిన సమావేశంలో డిప్యూటీ తహశీల్దార్ జగన్నాథ్ మాట్లాడుతూ మట్టితో చేసిన విగ్రహాలనే పూజించాలన్నారు. తక్కువ ఎత్తు ఉన్న విగ్రహాలను ఏర్పాటు చేయాలన్నారు. మండపాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరి అన్నారు. రహదారులకు ఆటంకం కలగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ మునీర్, ఎంపిడిఒ రమణమూర్తి, వినాయక చవితి నిర్వాహకులు పాల్గొన్నారు.

# షుగర్ ఫ్యాక్టరీ భూముల్లో ప్రయివేటు లేఅవుట్..!

**పనులు ముమ్మరం చేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు**

**ప్రజాశక్తి-పరిగి**

గతంలో పరిశ్రమల పేరుతో రైతుల నుంచి కారుచౌకగా తీసుకున్న వ్యవసాయ భూములు నేడు ప్రయివేటు లేఅవుట్లుగా మారుతున్నాయి. అందుకు మండలంలోని షుగర్ ఫ్యాక్టరీ పరిశ్రమకు కేటాయించిన భూములే నిదర్శనం. ఆ భూములను తాము కొనుగోలు చేశామని, ఈ భూమిలో రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం అడ్డంగా ఉన్న చెట్లను తొలగించేదుకు అనుమతి ఇవ్వాలని సన్ లాడ్జ్ కన్సల్టెంట్స్ అండ్ ప్రాపర్టీస్ ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యం ఇటీవల పరిగి తహశీల్దార్ హసీనా సుల్తానాకు దరఖాస్తు పెట్టుకున్నారు. ఈ భూములను పరిశ్రమల కోసం గతంలో కారుచౌకగా షుగర్ ఫ్యాక్టరీ నిర్మాణానికి అప్పజెప్పారు. ఈ భూములను పరిశ్రమల కోసమే వినియోగించుకోవాలని, ఇందులో లేఅవుట్లు వేయరాదని రైతులు పలుమార్లు భూ పోరాటాలు చేశారు. ఈ భూమిలో చేపట్టిన పనులను ఆపివేయడమే కాకుండా ఇక్కడ ఉన్న చెట్లను కొట్టరాదని అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ భూమిలో చదును చేసే పనులు, చెట్ల నరికివేతపై సుప్రీంకోర్టును సైతం ఆశ్రయించారు. అయితే చిన్న వైఫల్యంతో కేసు నెగ్గలేకపోయినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కాలంలో ఈ భూముల్లో మళ్లీ లేఅవుట్ ఏర్పాటుకు యాజమాన్యం సిద్ధమవుతోంది. ఈ తరుణంలో లేఅవుట్ కు అడ్డంగా ఉన్న ఏళ్ల నాటి వందలాది చెట్లను తొలగించేందుకు రియల్ ఎస్టేట్ వ్యాపారదారులు సిద్ధమయ్యారు. ఈ చెట్ల నరికివేతకు అనుమతులు ఇవ్వాలని తహశీల్దార్‌కు దరఖాస్తు చేసుకున్నారు.

**ల్యాండ్ డెవలప్మెంట్ పనులు ఆపాలి : తహశీల్దార్ హసీనా సుల్తానా**



షుగర్ ఫ్యాక్టరీ భూముల్లో చెట్లు తొలగించి చదును చేసిన ప్రయివేటు వ్యక్తులు

అనుమతులు రాకముందే పరిశ్రమల భూముల్లో ల్యాండ్ డెవలప్మెంట్ పనులు నిర్వహిస్తుండ టంపై తహశీల్దార్ స్పందించారు. పరిశ్రమలకు కేటాయించిన భూముల్లో చెట్లను నరికి వేయడం చట్టరీత్యా నేరమని, వెంటనే ల్యాండ్ డెవలప్మెంట్ పనులు ఆపాలన్నారు. అనుమతులు వచ్చిన తర్వాతే పనులు చేసుకోవాలన్నారు. చెట్ల తొలగింపునకు అనుమతులు ఇవ్వడం తమ పరిధిలో లేదని, ఇది అటవీ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. అప్పటివరకూ ఈ ప్రాంతంలో చెట్లు నరికితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

# విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ అవసరం

**ప్రజాశక్తి-కదిరి టౌన్**

విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ అలవర్చుకోవాలని కళాశాల, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని బ్లూమూన్ విద్యా సంస్థల ఛైర్మన్ మంచి శివశంకర్ విద్యార్థులకు సూచించారు. మున్సిపాలిటీ పరిధిలోని కుటాగుళ్ల వద్ద ఉన్న బ్లూమూన్ జూనియర్ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఘనంగా స్వాగతం పలికారు. విద్యాసంస్థల అధినేత ఎం.శివశంకర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించేలా తోడ్పాటు ఇస్తామని తెలిపారు. విద్యార్థులు ఉన్నత స్థితికి చేరుకోవాలని ఆకాంక్షించారు. అలాగే ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రశంసించి, అందుకు కృషి చేసిన అధ్యాపకులను అభినందించారు. చివరగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్ర మాలు అలరించాయి. అనంతరం ఛైర్మన్‌ను కళాశాల అధ్యాపకులు విద్యార్థులు ఘనంగా సత్కరిం చారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ మనోహర్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



ఛైర్మన్ శివశంకర్‌ను సన్మానిస్తున్న కళాశాల సిబ్బంది

# విద్యారంగ సమస్యలపై రేపు చలో కలెక్టరేట్ : ఎస్ఎఫ్ఐ

**ప్రజాశక్తి-పెనుకొండ**

రాష్ట్ర వ్యాప్తంగా విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈ నెల 25వ తేదీ చేపట్టనున్న చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నామాల నాగార్జున పిలుపునిచ్చారు. పట్టణంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల, జీవో-77 రద్దు, ఎయిడెడ్ విద్యాసంస్థలను నిర్వీర్యం చేస్తున్న జీవో-42, 35లరద్దు, మెస్ బిల్లు రూ. 3 వేలకు పెంపు, హాస్టళ్ల అభివృద్ధికి నిధులు, ఎయిడెడ్ జూనియర్ కళాశాలల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజన పథకం అమలు, అర్హులకు షరతులు లేకుండా తల్లికి వందనం రూ.15 వేలు ఇవ్వాలని, విద్యార్థులకు ఉచిత బస్ పాసులు, తదితర డిమాండ్లపై చలో కలెక్టరేట్‌కు పిలుపునిచ్చామని తెలిపారు. కార్యక్రమంలో మండల నాయకులు రవి, మహేష్, గుణ, తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నాగార్జున

# ప్రజల సమస్యలు పరిష్కరించాలి

**ముదిగుబ్బ :** మండల అధికారులు ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎంపిపి గొడ్డుమర్రి ఆదినారాయణ యాదవ్ సూచించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం ఎంపిపి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా అన్ని శాఖల అభివృద్ధి, సమస్యలపై చర్చించారు. శాఖల వారీగా ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఎంపిపి ఆదేశించారు. మంత్రి సత్యకుమార్ సహకారంతో అన్ని సమస్యలకు పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. అధికారులు కూడా బాధ్యతగా పనిచేసి ప్రజల సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. సమావేశంలో ఎంపిడిఒ నసీమ, తహశీల్దార్ నారాయణస్వామి, మండల స్థాయి అధికారులు, జడ్పిటిసి తిరుమలబాయ్, వైస్ ఎంపిపి వెంకట్‌రెడ్డి, కో ఆప్షన్ మెంబర్ బాలముని, ఎంపిటిసిలు, సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎరువుల దుకాణాలు తనిఖీ

**గాండ్లపెంట :** మండల కేంద్రంలోని మూడు ఎరువుల దుకాణాలను శనివారం వ్యవసాయ అధికారి సయ్యద్ షాదాబ్, తహశీల్దార్ బి.బాబురావు సందర్శించి స్టాక్ రిజిస్టర్లు, రికార్డులు, తదితర వాటిని తనిఖీ చేశారు. వారు మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన, గుర్తింపు కలిగిన ఎరువులు అందజేయాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే ఎరువులు, విత్తనాలు, మందులు అమ్మాలని, షాపు ముందు ధరల పట్టిక ఏర్పాటు చేయాలన్నారు. ఆధునిక టెక్నాలజీతో తయారు చేసిన నానో యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. రైతులకు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వారి వెంట ఎరువుల దుకాణాల నిర్వాహకులు పి.గోపాల్‌రెడ్డి, ఎస్.సుబహాన్, ఎ.రామాంజనేయరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు డైరీలు పంపిణీ

**పరిగి :** మండలంలోని బీచిగానిపల్లి, శాసనకోట, ఊటుకూరు జడ్పీ హైస్కూళ్లలో చదువుతున్న 8, 9, 10 తరగతులు విద్యార్థులకు మంత్రి సవిత సహకారంతో శనివారం టిడిపి నాయకులు డైరీలు పంపిణీ చేశారు. టిడిపి మండల కన్వీనర్ గోవింద్‌రెడ్డి ఆధ్వర్యంలో సుమారు 300 మంది విద్యార్థులకు డైరీలను పంపిణీ చేశారు. విద్య పట్ల అవగాహన, విషయసూచన అంశాలను మెరుగుపరిచేందుకే డైరీలు పంపిణీ చేసినట్లు సర్పంచి బాలాజీ తెలిపారు. మండల వ్యాప్తంగా అన్ని జడ్పీ హైస్కూళ్ల విద్యార్థులకు ఈ డైరీలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల డెవలప్మెంట్ కమిటీ సభ్యులు సూర్యనారాయణ, వెంకటేష్, సంజీవరాయప్ప, ప్రవీణ్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

# ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తే చర్యలు : ఎమ్మెల్యే

**ప్రజాశక్తి-బుక్కపట్నం**



ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి

ప్రభుత్వంపై అసత్య ప్రచారం చేస్తూ ప్రజల్లో అలజడి సృష్టించే వారిపై చట్టం ప్రకారం చర్యలు తప్పవని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి హెచ్చరించారు. బుక్కపట్నం మండలంలోని నార్సింపల్లి గ్రామానికి చెందిన వైసిపి మద్దతుదారుడు పలవాయి రమేష్‌కు రెండు చేతులు, రెండు కాళ్ల సక్రమంగా పని చేస్తున్నా చేతులు లేనట్టు నటించి వికలాంగుడైన నా పింఛనును కూటమి ప్రభుత్వం తొలగించిందని వీడియో చేసి సోషల్ మీడియాలో వైరల్ చేయడంపై ఎమ్మెల్యే తీవ్రంగా మండిపడ్డారు. రమేష్ గతంలో కూడా సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌పై తీవ్ర ఆరోపణలు చేసి సోషల్ మీడియా ద్వారా వీడియోలు వైరల్ చేశారన్నారు. ఎవరైనా దురుద్దేశపూర్వకంగా ప్రభుత్వం, ఎమ్మెల్యేపై వీడియోల ద్వారా దుష్ప్రచారం చేస్తే చట్టపరంగా చర్యలు తప్పవని ఎమ్మెల్యే హెచ్చరించారు.

## సిపిఐ అగ్రనేత 'సురవరం' మృతి బాధాకరం

**ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్**

సిపిఐ అగ్రనేత సురవరం సుధాకర్‌రెడ్డి మృతి అత్యంత బాధాకరమని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి శనివారం ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. సిపిఐ అగ్ర నాయకులు, మాజీ ఎంపి సురవరం సుధాకర్‌రెడ్డి మృతికి వారు ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. విద్యార్థి నాయకుడి నుంచి సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎదిగిన గొప్ప నాయకులు అన్నారు. జీవితమంతా ప్రజల కోసమే పని చేశారన్నారు. పార్లమెంట్ సభ్యునిగా ఆయన సేవలు ఎనలేనివన్నారు. తెలుగు రాష్ట్రాల్లో నిర్మాణాత్మక అభివృద్ధికి ఆయన సేవలు ఎంతో దోహదపడ్డాయన్నారు. ఆయన జీవితామంతా ప్రజా ఉద్యమానికే పాటు పడ్డారని, ప్రజల సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై రాజీ లేని పోరాటం చేసిన వ్యక్తి సురవరం అని కొనియాడారు. ఆయన ఎప్పటికీ ప్రజల హృదయాల్లో నిలిచిపోతారన్నారు.

## టీనేజ్ ఆరోగ్యంపై అవగాహన

**ప్రజాశక్తి-చిలమత్తూరు**

మండలంలోని సోమఘట్ట జడ్పీ హైస్కూల్‌లో శనివారం వాసవ్య మహిళా మండలి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రాజెక్టు డైరెక్టర్ సునీత మాట్లాడుతూ టీనేజ్ ఆరోగ్యం, బాల్య వివాహాల దుష్పరిణామాలు, తల్లిదండ్రులు పిల్లలను పెంచే విధానం, విద్య ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ఎన్.రాజ్యలక్ష్మి, హెచ్ఎం శంకర్‌రెడ్డి, వీవో నాయకులు, సీసీ, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# పింఛన్ల తొలగింపు అన్యాయం : వైసిపి

**ప్రజాశక్తి-గాండ్లపెంట**

మండలంలో అర్హులైన వికలాంగుల పింఛన్లు తొలగించడం సరికాదని, వెంటనే వారి పింఛన్లను పునరుద్ధరించాలని వైసిపి నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ఎస్‌పి హైదర్ వలి షాపు వద్ద వైసిపి మండల కన్వీనర్ జి.రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రీ వెరిఫికేషన్ పేరుతో అర్హుల పింఛన్లు తొలగించడం దుర్మార్గమన్నారు. వెంటనే వారి పింఛన్లు కొనసాగించాలని లేనిచో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో సర్పంచి నాగభూషణంరెడ్డి, నాయకులు జగన్, ఫయాజ్‌అలీ, శంకర్‌నాయుడు, బావుద్దీన్, మహమ్మద్ ఇక్బాల్, చంద్ర, తదితరులు పాల్గొన్నారు

## తహశీల్దార్‌కు 108 సిబ్బంది వినతి

**ప్రజాశక్తి-ముదిగుబ్బ**

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం 108 సిబ్బంది తహశీల్దార్ నారాయణస్వామికి వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ మండల ప్రజలకు 20 ఏళ్లుగా అత్యవసర సేవలు అందిస్తున్నామన్నారు. అలాంటి మాకు 108 వాహనాలు నిలుపుకోవడానికి, ఏమర్జెన్సీ మెడికల్ ఇండెంట్ పెట్టుకోవడానికి, ఉండటానికి గది కానీ షెల్టర్ కానీ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్థలం కేటాయించి షెల్టర్ ఏర్పాటు చేయాలని కోరారు. వినతి ఇచ్చిన వారిలో 108 సిబ్బంది ఎం.రవికుమార్, పి.మల్లేష్, టి.వెంకటరమణ, కె.ఓబిలేసు, కె.నారాయణస్వామి నాయక్, జి.జగన్నాథం పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న బంగారు కృష్ణమూర్తి

## వాల్మీకుల 'ఎస్టీ జాబితా' ఏమైంది..?

**ప్రజాశక్తి-కదిరి టౌన్**

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేరుస్తామని ఇచ్చిన హామీ ఏమైందని వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బంగారు కృష్ణమూర్తి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ప్రశ్నించారు. పట్టణంలో శనివారం రాష్ట్ర వాల్మీకి సేవా సంఘం రాష్ట్ర సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వాల్మీకి సామాజిక వర్గం ప్రజల అభ్యున్నతి పట్ల ప్రభుత్వాలు చిత్తశుద్ధితో వ్యవహరించాలని డిమాండ్ చేశారు. గతంలో వాల్మీకులు ఎస్టీ జాబితాలో ఉండేవారని, ఎన్నికల హామీ మేరకు ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరారు. ఈ విషయంలో కాలయాపన చేయడం వారిని మోసం చేయడమే అన్నారు.

## పిహెచ్‌సి తనిఖీ

**ప్రజాశక్తి-నల్లచెరువు**

స్థానిక పిహెచ్‌సిని శనివారం డిఎంహెచ్ఒ డాక్టర్ ఫైరోజ్‌బేగం సందర్శించి రికార్డులను పరిశీలించారు. వైద్యులు, సిబ్బంది అటెండెన్స్, డెలివరీ కేసులు, తల్లి బిడ్డ క్షేమం గురించి ఆరా తీశారు. కెజిబివి, బిసి హాస్టల్‌ను విజిట్ చేసినట్లు వారి దృష్టికి తీసుకొచ్చారు. అక్కడ కూడా ఫాగింగ్ చేయించామని డాక్టర్ అలేఖ్య తెలిపారు. ఎక్కడా జ్వరాలు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

## వికలాంగుడినని తప్పుడు వీడియో చేసిన వ్యక్తి అరెస్ట్

**ప్రజాశక్తి-బుక్కపట్నం**

వికలాంగుడినైన తన పింఛను తొలగించారని ఓ వీడియో చేసి సోషల్ మీడియాలో వైరల్ చేసిన మండలంలోని నార్సింపల్లి గ్రామానికి చెందిన రమేష్‌ను శనివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రమేష్ తనకు ఓ చేయి లేదని, అయినా కూటమి ప్రభుత్వం పింఛను తొలగించిందని ఓ వీడియో చేసి గత శుక్రవారం సోషల్ మీడియాలో వైరల్ చేశాడు. ఈ విషయంలో అతడిపై శనివారం స్థానిక టిడిపి నాయకులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపారు.



వీడియో చేసిన నిందితుడు రమేష్



విద్యార్థిని సాధికకు ప్రశంసాపత్రం అందజేస్తున్న అన్నమయ్య జిల్లా కలెక్టర్ శ్రీధర్‌బాబు

## ప్రతిభా విద్యార్థినికి ప్రశంసాపత్రం

**నల్లచెరువు :** 2024-25 విద్యా సంవత్సరంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో 593 మార్కులు సాధించిన స్థానిక జడ్పీ హైస్కూల్ విద్యార్థిని ఎస్.సాధికకు శనివారం అన్నమయ్య జిల్లా కలెక్టర్ శ్రీధర్‌బాబు రాయచోటిలో ప్రశంసా పత్రం అందజేసి అభినందించారు. ప్రభుత్వం మెరిట్ విద్యార్థులకు ఇచ్చే రూ. 10వేల నగదు బహుమతిని సాధిక గతంలోనే పొందింది.

## ఆలయ హుండీ చోరీ

**నల్లచెరువు :** స్థానిక గీతామందిరం ఆలయంలో ఉన్న హుండీని గుర్తు తెలియని వ్యక్తులు పగలగొట్టి అందులో ఉన్న సుమారు రూ. 20 వేల నగదు ఎత్తుకెళ్లారని ఆలయ కమిటీ సభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు అక్కడికి వెళ్లి ఆలయ పరిసరాలను పరిశీలించారు.

## బ్యాంకు ఖాతాలో నగదు మాయం

**సోమందేపల్లి :** స్థానిక సప్తగిరి కాలనీలో నివసిస్తున్న వాసు బ్యాంకు ఖాతా నుంచి రూ. 20,500 నగదును సైబర్ నేరగాళ్లు అపహరించారు. దీంతో శనివారం పుట్టపర్తిలోని సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు వాసు పేర్కొన్నారు.



# ప్రజాసమస్యలు గాలికి..!

**ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి**

ప్రజా సమస్యలు గాలికొదిలి నేతలు ఇతర సమస్యలపై ఎక్కువ దృష్టి పెడుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ వారంలో చోటు చేసుకుంటున్న రాజకీయ పరిణామాలుగాని, ముందుకొచ్చిన సమస్యలుగాని చూస్తే అదే స్పష్టమవుతోంది. ఉమ్మడి జిల్లాలో ఈ వారంలో అనేక సమస్యలు ముందుకొచ్చాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన జూన్, జులై మాసాల్లో వర్షాలు సరిగా లేక రైతులు పంటలను సాగు చేసుకోలేకపోయారు. ఉమ్మడి జిల్లాలో దాదాపు 60 శాతం భూమిలో విత్తనం పడలేదు. రైతులు ఆకాశం వైపు ఎదురుచూస్తు చూస్తూ ఆగస్టులో మంచి వర్షాలే పడ్డాయి. అయితే ప్రధాన పంటల సమయం ముగిసింది. ప్రత్యామ్నాయం పంటలకే ఇది అనువైంది. ఆ పంటలు వేసుకుందామంటే ప్రభుత్వం ప్రత్యామ్నాయం విత్తనాలను సిద్ధం చేసిలేదు. దీంతో రైతులే సాగుకు రకరకాలుగా తిప్పలు పడుతున్నారు. కాకపోతే డబ్బులు పెట్టి కొందామన్న యూరియా దొరకడం లేదు. యూరియాని దొరికిచ్చుకోవడం రైతులకు తీవ్రమైన ఇబ్బందులు తప్పడం లేదు. ఈ సమస్యకు పరిష్కారం కోసం ప్రయత్నం చేసిన ఒక్క నేత కూడా జిల్లాలో కనిపించలేదు. అధికారులదే ఆ బాధ్యత అన్నట్టుగా వారిపై నెట్టేశారు. ఇక వికలాంగుల పింఛన్ల సమస్య మరింత ముందుకొచ్చింది. ఎన్నో సంవత్సరాలుగా పింఛను అందుకుంటున్న వారికి కూడా ఇక నుంచి పింఛను రాదంటూ




నోటీసులు జారీ చేశారు. దీంతో దివ్యాంగులు పింఛను కోసం కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అనంతపురం జిల్లా కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఇప్పటికే వారి ఆందోళనలు సమసిపోలేదు. నిబంధనల పేరుతో కార్యాలయాల వద్దకు ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇక ఖరీఫ్ సీజన్ ముగియడంతో రబీ పంటల సాగుపై రైతులకు సలహా మండలి సమావేశం నిర్వహించలేదు. ఏ ఆయకట్టుకు ఎప్పుడు నీరిస్తారన్న దానిపై స్పష్టతలేదు. ఒకవైపు హంద్రీనీవా, తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువకు నీరొస్తున్నా నీటిని అందించే విషయంలో నేతలు దృష్టి సారించడం లేదన్న విమర్శలున్నాయి.

రాజకీయంగా పెద్ద దుమారం రేపిన ఘటనలు రెండు చోటు చేసుకున్నాయి. ఒకటి అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే సినీహీరో జూనియర్ ఎన్టీఆర్‌పై చేసిన వ్యాఖ్యలు రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ చర్చనీయాంశమయ్యాయి. ఆయనపై జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు మండిపడుతున్నారు. ప్రతిపక్ష పార్టీ నేతలు కూడా దగ్గుబాటివైపు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అంతకు మునుపు ఆయన చుట్టూ భూవివాదాలు పెద్దఎత్తున చోటు చేసుకున్నాయి. అనంతపురం నగరంలో జరుగుతున్న వివాదాలకు ఎమ్మెల్యే కారణమని మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి ఆరోపించడం చర్చనీయాంశమైంది. తాడి పత్రిలో వైసిపి, టిడిపిల మధ్య పోరు తీవ్రస్థాయి లోనే జరిగింది. కోర్టు ఉత్తర్వుల మేరకు తాడిపత్రి పట్టణంలోకి ప్రవేశిస్తానని కేతిరెడ్డి పెద్దారెడ్డి ప్రయ త్నించారు. కాని పోలీసులు అడ్డుకుని ఆయన్ను తిరిగి వెనక్కు పంపించారు. మరోమారు ఆయన న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఇప్పటికైనా అను మతించాలని వైసిపి నాయకులు డిమాండ్ చేస్తు న్నారు. జిల్లా ఎస్పీని కలిసి మరోమారు విజ్ఞప్తి చేశా రు. ఈ ఇద్దరి మధ్య వివాదం ఇప్పటికీ సద్దుమణ గలేదు. నేతలు ఈ గొడవల్లో ఉండగా ప్రజా సమస్యలు మాత్రం పట్టించుకోవడం లేదన్న విమ ర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రజా సమస్యలను గాలి కొదిలేసి వారి వారి సమస్యలు తలమునకలై ఉన్నారు.